## నేటి సాయంత్రం 4 నుంచి నియోజకవర్గాల్లో అవతరణోత్సవాలు

### జిల్లా ప్రజలు విజయవంతం చేయాలి: ఖమ్మం కలెక్టర్

ఖమ్మం, జూన్ 1: రాష్ట్ర అవతరణ వేడుకలను సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఆయా నియోజకవర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో రాణి ఫంక్షన్ హాల్లో, వైరా నియోజకవర్గంలో కమ్మవారి కల్యాణ మండపంలో, మధిర నియోజకవర్గంలో రిక్రియేషన్ క్లబ్‌లో, ఖమ్మం నియోజకవర్గంలో శ్రీ భక్తరామదాసు కళాక్షేత్రంలో, పాలేరు నియోజకవర్గంలో టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ తరువాత ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యేల తమ సందేశాలను వినిపిస్తారని అన్నారు.

## దిగుమతి సుంకాన్ని ఉపసంహరించుకోవాలి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరాటౌన్, జూన్ 1: కేంద్ర ప్రభుత్వం ముడి పంట నూనెలు దిగుమతి సుంకం 10% తగ్గింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో సంక్రాంతి పురుషోత్తం అధ్యక్షతన జరిగిన పామాయిల్ సాగు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ముడి వంట నూనెలు దిగుమతి సుంకం 27.5%, రిఫైనరీ ఆయిల్‌పై అన్ని రకాల సుంకాలు కలిపి 37.5% విధించిన కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ముడి వంట నూనెలపై బేసిక్ దిగుమతి సుంకం 10% తగ్గింపు చేయడం వలన పామాయిల్ సాగు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో రెండున్నర లక్షల ఎకరాల విస్తీర్ణంలో పామాయిల్ సాగు చేస్తున్న రైతులపై ఎగుమతి, దిగుమతి సుంకం ప్రభావం చూపుతుందన్నారు. సమావేశంలో చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, నామా శ్రీనివాసరావు, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, తోట నాగేశ్వరరావు, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేంసూరు, జూన్ 1: వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003–04 పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 21 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ప్రస్తుతం తమ పరిస్థితులు తెలుసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు శాంతకుమారి, కేశవరెడ్డి, రామ్మోహన్‌రావు, బాబు, ప్రస్తుత స్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బీ.కే.నరసింహారావును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బూరుగు శాంతి, జయకర్, కంచర్ల రవి, సత్యనారాయణ, రాజేష్, గోపి, రాజశేఖర్, రాంబాబు, పుల్లారావు, దుర్గారావు, జానీ, సుజాత, సునీత, మాధవి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి వంద రోజుల కార్యాచరణ

సత్తుపల్లిటౌన్, జూన్ 1: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ప్రాంతాలను నివాసయోగ్యమైన, స్థిరమైన, పర్యావరణ అనుకూలత నగరాలుగా అభివృద్ధి చేయడం కోసం, పరిశుభ్రతమైన, ఆరోగ్యవంతమైన, ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనే సామర్థ్యం కలిగిన పట్టణ ప్రాంతాలను నిర్మించేందుకు ఈ నెల 2 నుంచి వంద రోజుల కార్యచరణ ప్రణాళిక రూపొందించినట్లు సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ కే.నరసింహ ఆదివారం తెలిపారు. ప్రతిరోజు 'ఒక చర్య– ఒక మార్పు' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

## 'బొగ్గుల' సేవలు అభినందనీయం: వైరా ఎమ్మెల్యే

ఖమ్మం, జూన్ 1: గృహ నిర్మాణ సంస్థ అధికారిగానూ, ఆ శాఖ యూనియన్ నాయకుడిగానూ బొగ్గుల వెంకటరామిరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హౌసింగ్ ఏఈ బొగ్గుల వెంకటరామిరెడ్డి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో వైరాలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తోపాటు మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, గృహ నిర్మాణ సంస్థ యూనియన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. బొగ్గుల వెంకటరామిరెడ్డి గృహ నిర్మాణ సంస్థలో 41 ఏళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి అటు నిరుపేదలకు, ఇటు యూనియన్‌కు ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. అనంతరం వెంకటరామిరెడ్డి దంపతులను సన్మానించారు. నాయకులు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, యూనియన్ నాయకులు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# మానసిక ఉల్లాసానికి ఆటలు దోహదం

### ఖమ్మంలో కరాటే పోటీలు ప్రారంభం

ఖమ్మం, జూన్ 1: ఆటల వల్ల శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసం, ఆరోగ్యం పెంపొందుతాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఎంపీ తన తల్లిదండ్రులు స్వర్గీయ వద్దిరాజు నారాయణ–వెంకటనర్సమ్మల జ్ఞాపకార్థం ఖమ్మం వర్తక సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన నేషనల్ చాంపియన్‌షిప్ –2025 కరాటే పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన తల్లిదండ్రుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఖమ్మంకు చెందిన పోలీస్ అధికారి సాధుల సారంగపాణి కూతురు మేఘన షూటింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించారని ఎంపీ రవిచంద్ర వివరించారు. కరాటే నేర్చుకోవడం చాలా మంచిదని, స్వీయరక్షణకు ఇది దోహదపడుతుందని చెప్పారు. కరాటేలో విశేష ప్రతిభ చూపి ఎన్నో మెడల్స్ సాధించిన జల్లెల శ్రీనివాసరావు సుమన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే–డూ అకాడమీ ఇండియా పేరుతో మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం నగరాల్లో పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జడ్జి కే.మురళీమోహన్, సినీహీరో రణధీర్, సినీ నిర్మాత తాజ్, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, బీఆర్‌ఎస్ నాయకుడు తోట వీరభద్రం, పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్వామి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



కరాటే పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

#### ఉత్తమ విద్యార్థినికి ఎంపీ సత్కారం

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఉత్తమ విద్యార్థిని శార్వాణిని శాలువాతో ఆదివారం సత్కరించారు. కొత్తగూడెం రామవరం–2 ఇంక్లైన్ వ్యాస్తవ్యుడు, బీఆర్‌ఎస్‌కు చెందిన తమ్మిశెట్టి అశోక్–నాగమణి దంపతుల కూతురు శార్వాణి ఇంటర్మీడియట్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 470 మార్కులకుగాను 460 మార్కులు సాధించింది. అశోక్ తన కూతురు శార్వాణిని వెంట తీసుకుని విద్యానగర్ వార్డు మెంబర్, ఆప్తమిత్రుడు గజ్జెల కృష్ణమూర్తితో కలిసి ఎంపీ రవిచంద్రను ఆదివారం ఖమ్మంలో కలిశారు. ఈ సందర్భంగా శార్వాణిని ఎంపీ రవిచంద్ర ఆశీర్వదించారు.



విద్యార్థిని శార్వాణిని సత్కరిస్తున్న ఎంపీ వద్దిరాజు

# నేటినుంచి ఇంటర్ కళాశాలలు పునఃప్రారంభం

ఖమ్మం అర్బన్, జూన్ 1 : వేసవి సెలవుల అనంతరం ఇంటర్ కళాశాలలు సోమవారం పునఃప్రారంభం కానున్నాయి. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పరిధిలోని కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహించనున్నారు. ఇంటర్ విద్యాశాఖ ప్రతి సంవత్సరం ఇంటర్ కళాశాలల అనుమతులను రెన్యువల్ చేస్తుంది. 2025–26 విద్యాసంవత్సరంలో భాగంగా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని కళాశాలల్లో రెన్యువల్ ప్రక్రియ పూర్తి కాగా, ప్రైవేట్ కళాశాలల్లో పూర్తి చేయలేదు. గత ప్రభుత్వం ఫైర్ నిబంధన విషయంలో అండర్‌టేకింగ్ తీసుకుని అనుమతులు ఇచ్చింది. ఈ ప్రభుత్వం ఫైర్ విషయంలో నిబంధనలు కఠినతరం చేయడం పట్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో 56కిపైగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉండే వాటిల్లో సుమారు 30 కళాశాలల వరకు మాత్రమే అనుమతులు మంజూరు చేసింది. మిగిలిన కళాశాలలకు పునఃప్రారంభమవుతున్న అనుమతుల విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. కళాశాలల పునఃప్రారంభం కాకముందే అత్యధిక కళాశాలల్లో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు పూర్తిచేసిన, ఇప్పటికే ద్వితీయ సంవత్సరం తరగతులు జరుగుతున్న ఇంటర్ విద్యాశాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకుని విద్యార్థి సంఘాలు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన వాటివైపు కన్నెత్తి చూడలేదనే ఆరోపణలున్నాయి.

#### అనుమతులు లేకుంటే చేరొద్దు..

##### డీఐఈవో రవిబాబు

జిల్లాలో అనుమతిలేని కళాశాలల్లో విద్యార్థులు చేరొద్దని డీఐఈవో కె రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీలు, ట్యూషన్ సెంటర్లకు ఎలాంటి అనుమతులను ఇంటర్ బోర్డు ఇవ్వలేదని వాటిల్లో చేరొద్దని పేర్కొన్నారు. ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అనుమతులు పొందిన కళాశాలల వివరాలు ఉన్నాయన్నారు.


# 3 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

ఎర్రుపాలెం, జూన్ 1: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి కొత్త ఆర్‌వోఆర్–2025 చట్టం అమలులో భాగంగా ఈ నెల 3 నుంచి 20 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ మన్నే ఉషాశారద ఆదివారం ఒక ప్రకనటనలో తెలిపారు. జూన్ 3న మొలుగుమాడు, శఖునవీడు, జూన్ 4న జమలాపురం, వెంకటాపురం, 5న రామన్నపాలెం, ఇనగాలి, 6న రాజుపాలెం, నారాయణపురం, గట్లగౌరవరం, 9న తక్కెళ్లపాడు, మీనవోలు, 10న కాచవరం, గుంటుపల్లిగోపవరం, 11న భీమవరం, భీమవరం హరిజనవాడ, అయ్యవారిగూడెం, 12న లక్ష్మీపురం, మామునూరు, 13న బుచ్చిరెడ్డిపాలెం, నరసింహాపురం, 16న చొప్పకట్లపాలెం, రాజులదేవరపాడు, 17న కండ్రిక, బంజర, పెద్దగోపవరం, 18న బనిగండ్లపాడు, పెగళ్లపాడు, 19న ఎర్రుపాలెం, తెల్లపాలెం, 20న రేమిడిచర్ల, కొత్తపాలెం, రామాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నట్లు పేర్కొన్నారు.

మధిర, జూన్ 1: భూ సమస్యల పరష్కారం కోసం భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాచబండి రాంబాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. భూభారతి కొత్త చట్టం అమలులో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 24 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, గ్రామాల వారీగా ఉదయం 9 గంటల నంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 3న జాలిముడి, మల్లారం, రొంపిమల్ల, 4న ఎండపల్లి, సిరిపురం, 5న వంగవీడు, మునగాల, 6న ఆత్కూరు, మాటూరు, 9న నాగవరపాప్పాడు, సిద్ధినేనిగూడెం, 10న నక్కలగరుబు, దిడుగుపాడు, 11న మధిర, ఇల్లెందులపాడు, 12న తొండలగోపవరం, తొర్లపాడు, 13న అంబారుపేట, నిధానపురం, 16న రాయపట్నం, ఇల్లూరు, 17న చిలుకూరు, ఖమ్మంపాడు, 18న మడుపల్లి, దెందుకూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తల్లాడ, జూన్ 1: భూ సమస్యల పరష్కారం కోసం భూభారతి రెవెన్యూ గ్రామసభలను ఈ నెల 3 నుంచి మండలంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3న అన్నారుగూడెం, బస్వాపురం, 4న గోపాలపేట, కలకొడిమ, 5న బాలప్పేట, కుర్నవల్లి, 6న మల్లారం, ముద్దునూరు, 9న పినపాక, లక్ష్మీపురం, 10న అంబేద్కర్‌నగర్, రామానుజవరం, 11న కొడవటిమెట్ట, మిట్టపల్లి, 12న రేజర్ల, కేశవాపురం, 13న తెలగవరం, నూతనకల్, 14న మల్సూరుతండా, 16న గొల్లగూడెం, రంగంబంజర, 17న మంగాపురం, వెంకగన్నపేట, 18న తల్లాడ, బిల్లుపాడు, 19న కొత్తవెంకటగిరి, రామచంద్రాపురం గ్రామాల్లో జరుగుతాయని పేర్కొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘాలతో సింగరేణి సీఎండీ సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సంఘాల నాయకులు

సత్తుపల్లిటౌన్, జూన్ 1: సింగరేణి 11 ఏరియా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘాలతో సింగరేణి సీఎండీ బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ఇంట్రాక్టివ్ మీటింగ్ నిర్వహించారు. సింగరేణి సంస్థ భవిష్యత్ గురించి నిర్వహించిన ఇంట్రాక్టివ్ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ బలరాం సింగరేణి సంస్థ మనుగడ కోసం, సంస్థ స్థితిగతుల కోసం మాట్లాడారు. సింగరేణి సంస్థను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని, కార్మికులందరూ సమష్టి కృషితో పనిచేయాలని సూచించారు. అధికారులు సింగరేణి ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించారు. సత్తుపల్లి నుంచి బీసీ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. సత్తుపల్లి, కొత్తగూడెం ఏరియాలో అధికారులు, ఉద్యోగులు సమిష్టి కృషితో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో తోడ్పడుతామని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ఏరియా బీసీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, దారా భీమయ్య, తీగల క్రాంతికుమార్, సూర్యప్రకాశ్, బాణోతు అశోక్, మోహన్ పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు సన్మానం

కూసుమంచి (నేలకొండపల్లి), జూన్ 1: పదోతరగతిలో మంచి అత్యధిక మార్కులు సాధించిన నేలకొండపల్లి మండలంలోని విద్యార్థులను భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి చలపతిరావు ఆదివారం సత్యసాయి మందిరంలో సన్మానించారు. సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి రామారావు, బాధ్యులు తెల్లగొర్ల లింగస్వామి, వెంకటరమణ గుప్త, వల్లం భాస్కర్ రావు, భాస్కర్ రెడ్డి, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎంఈవో, సొసైటీ బాధ్యులు

## హౌసింగ్ ఏఈకి సన్మానం

పెనుబల్లి, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణశాఖ జనరల్ సెక్రటరీ, గృహ నిర్మాణ శాఖ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బొగ్గుల రామిరెడ్డి హౌసింగ్ ఏఈగా 41 సంవత్సరాలు సేవలు అందించి పదవీ విరమణ పొందిన సందర్భంగా వైరాలో కమ్మవారి కళ్యాణ మండపంలో జరిగిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో కల్లూరు మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కల్లూరు మండల సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు చింతలపూడి బారిష్టర్, పసునూరి శ్రీనివాసరావు, కటుంబసభ్యులు బొగ్గుల బస్విరెడ్డి, బొగ్గుల కృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి సహకరిద్దాం



కరపత్రాలను చూపుతున్న ఆర్యవైశ్యులు

పెనుబల్లి, జూన్ 1: ఈ నెల 8న కల్లూరులో జరిగే జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు తెలిపారు. ఆదివారం పెనుబల్లిలో నిర్వహించిన మండల ముఖ్య సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికలు అందించాలని మండల, పట్టణ కమిటీలను కోరారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి పాటు పడదామని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి పసుమర్తి వెంకటేశ్వరరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ వనమా సత్యప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పవరపు బలరాం, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పసుమర్తి రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథం, పట్టణ అధ్యక్షుడు కొదుమూరి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు నాగబండి ప్రభాకర్, సత్యనారాయణ, వేముల కిరణ్, మిట్టపల్లి కిరణ్, వర్తకసంఘం అధ్యక్షులు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవం

సత్తుపల్లిటౌన్, జూన్ 1: సత్తుపల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే.నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పురపాలక సంఘం కార్యాలయం నుంచి బస్టాండ్ రింగ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, స్కూల్ అండ్ కళాశాలలు, ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

## పోలీస్ అధికారులకు సీపీ అభినందన

మామిళ్లగూడెం, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన పోలీస్ సేవా పతకాల్లో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అడిషనల్ డీసీపీ(లా అండ్ ఆర్డర్) జి.ప్రసాద్‌రావు, ఖమ్మం త్రీటౌన్ ఏఎస్ఐ ఎస్‌వీ చక్రకళాధర్‌రావుకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. మరో ఎనిమిది మంది పోలీస్ అధికారులకు సైతం సేవా పతకాలు దక్కాయి. పతకాలు సాధించిన పోలీస్ అధికారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు.

## నేడు పోటు ప్రసాద్ స్మారక స్తూపావిష్కరణ

ఖమ్మం, జూన్ 1 : అమరజీవి భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ స్మారక స్తూపావిష్కరణ సోమవారం 10గంటలకు నిర్వహించనున్నట్లు సీపీఐ ఖానాపురం హవేలీ కార్యదర్శి ఏనుగు గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘకాలంపాటు కమ్యూనిస్టులో పనిచేసి పలు ఉద్యమాలకు నాయకత్వం వహించిన ప్రసాద్ స్మారక స్తూపాన్ని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు పువ్వాడ నాగేశ్వరరావు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాగం హేమంతరావు, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. అదేవిధంగా ఖానాపురం హవేలీ ఏరియా సీపీఐ మహాసభ సోమవారం ఉదయం పాత మమత మెడికల్ కళాశాల రోడ్డులోని సిటీ సెంట్రల్ ఫంక్షన్‌హాల్లో జరుగుతుందని తెలిపారు.

## నేటి ప్రజావాణి రద్దు

ఖమ్మం, జూన్ 1: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 2వ తేదీ రాష్ట్ర అవతరణదిన వేడుకల సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి




మాట్లాడుతున్న మోహన్‌రావు

ఖమ్మం రూరల్, జూన్ 1: కేంద్ర సర్కార్ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండుతో జూలై 9న సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్లపల్లి మోహన్‌రావు చెప్పారు. దీనిని కార్మికులతా జయప్రదం చేయాలని కోరారు. ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ క్రాస్ రోడ్డులోగల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో ఆదివారం సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులపాలిటకు నాలుగు లేబర్ కోడ్లు ఉరితాళ్లుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రాంబ్రహ్మం గౌడ్, ఎం.నాగేశ్వరరావు, కె.నర్సింహారావు, పి.వెంకటరమణ, ఎస్.లింగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు వితరణ

ఎర్రుపాలెం, జూన్ 1: మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన బొడ్డుపాటి వెంకటేశ్వర్లు ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు దోమందుల సామేలు, దోమందుల చిన్నముత్తయ్య ట్రస్టు నుంచి దహన సంస్కారాల నిమిత్తం మృతుడి కుమారులు బొడ్డుపాటి జమలయ్య, వెంకటయ్యకు నగదు అందజేశారు. కార్యక్రమంలో గొల్లమందల వెంకటేశ్వరరావు, దొండపాటి పుల్లయ్య, దొండపాటి వెంకటరత్నం, గొల్లమందుల తిరుపతిరావు, గొల్లమందల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడిగా కృష్ణ



మధిర, జూన్ 1: మధిర మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడిగా కురువెళ్ల కృష్ణను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి ఎన్నో రకాలుగా కళ్యాణ మండపం తీర్చిదిద్ది, పలు అభివృద్ధి కార్యక్రమాలను చూస్తూ పాత బకాయిలను తీరుస్తూ కళ్యాణ మండపాన్ని అభివృద్ధి చేసిన కురువెళ్ల కృష్ణకు పలువురు ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మధిర పట్టణ, మండల ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## బత్తినేని ట్రస్టు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు మందులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

బోనకల్లు, జూన్ 1: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ఆదివారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా యంగల ఆనందరావు మాట్లాడుతూ.. బీపీ, షుగర్ పేషంట్లకు బత్తినేని ట్రస్టు వైద్యసేవలు ఓ వరమన్నారు. బత్తినేని చారిటబుల్ ట్రస్టును స్థాపించి విద్య, వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. బీపీ, షుగర్ పేషంట్లు తప్పనిసరిగా నెలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకొని, క్యాంపు వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ క్యాంపులో 100 మందికి పరీక్షలు నిర్వహించగా ట్రస్టు సభ్యులు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్ చేతుల మీదుగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏలూరి పూర్ణచంద్రరావు, దుగ్గి భద్రయ్య, ఆకెన పవన్, యంగల గిరి, కిరణ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## యాదవులు, కురుములకు నగదు బదిలీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య

బోనకల్లు, జూన్ 1: ప్రభుత్వం యాదవులు, కురుములకు రూ.2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడుత గొర్రెల పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బోనకల్లులో సంఘం మండల కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో యాదవులు, కురుములకు 2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని తమ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చినా హామీని నెరవేర్చడంలేదని విమర్శించారు. గొర్రెల కాపరులపై రాష్ట్ర వ్యాప్తంగా ఫారెస్టు అధికారులు దాడులు పెరుగుతున్నాయని, రైతుబీమా ఉండదనే కారణం చూపి ప్రమాదవశాత్తు మరణిస్తున్న గొర్రెల కాపరులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని వాపోయారు. సమావేశంలో చింతలచెరువు కోటేశ్వరరావు, పిక్కెల సీతారాములు, జోనెబోయిన గురవయ్య, మందా వీరభద్రం, పుచ్చకాయల వలరాజు, గంగదేవుల నరసింహా, ఎర్రబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.